
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 20 జూలై 2024



● ఐదెకరాలకు పరిమితం చేయాలి

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



రైతుభరోసా పథకాన్ని ఐదెకరాలకు పరిమితం చేసి అంతకంటే ఎక్కువ భూమి ఉన్న వారికి కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయాలని ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి రైతుగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష రుణమాఫీని విడతల వారీగా ఇవ్వడంతో అవి వడ్డీకే సరిపోయాయని, దేశచరిత్రలో సువర్ణ అక్షరాలుగా రెండు లక్షల రుణమాఫీ ఏకమొత్తంలో చేయడం నిలుస్తుందని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అదానీ, అంబానీలకు లక్ష కోట్ల రుణాలను మాఫీ చేసిందేగానీ రైతులకు, పేదలకు చేసిందేమీలేదన్నారు. ఆధార్‌లింకు లేకపోవడంతో ఐదుశాతం రైతులు రుణమాఫీ పొందలేక పోతున్నారని, వారికి న్యాయం జరిగేలా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, మానకొండూర్, పెద్దపెల్లి, రామగుండం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయరమణారావు, మక్కాన్ సింగ్ ఠాకూర్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్‌ఝా సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

అందరి అభిప్రాయాల మేరకే రైతు భరోసా

- రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం
- త్వరలో పంటల బీమా పథకం అమలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కరీంనగర్ టౌన్,జూలై 19: రైతు భరోసా అమలు కోసం ఏర్పడిన మంత్రివర్గ ఉప సంఘం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి రాష్ట్రంలోని రైతు లందరి సూచనలు అభిప్రాయాలను క్రోడీకరించి రైతు భరోసా అమలుపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసు కుంటుందని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రైతు భరోసా పథకం అమలుపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించారు. కరీం నగర్ ఉమ్మడి జిల్లాలోని దా దాపు 25 మంది రైతులు, రైతు ప్రతినిధుల నుంచి మంత్రివర్గ ఉప సం ఘం అభిప్రాయాలు సేక రించింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతు సంక్షేమానికి తమ ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యత ఇ స్తుందని పేర్కొన్నారు. రైతు భరోసాను అందించేందుకు రైతుల నుంచి అభిప్రా యాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదు రైనా, ఎంత కష్టమొచ్చినా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధా న్యత ఇస్తుందని స్పష్టం చేశారు. పంటల బీమా పథకం కూడా అమలు చేసేందుకు రూపకల్పన చేస్తు న్నామని వెల్లడించారు. ప్రభు త్వమే బీమా డబ్బులను చెల్లించి పం టల బీమా అమలు చేస్తుందని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో రైతు లు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిం చారు. ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలవాలని పేర్కొ న్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు చేసుకో వచ్చని తెలి పారు. నెల జీతం లాగా రైతులకు ఆదా యం వస్తుం దని, ఈ పంట సాగుపై దృష్టి సారించాలని సూచిం చారు. 100 లక్షల మెట్రిక్ టన్నుల అవస రాలకు గాను 3.9 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి మాత్రమే అవుతున్నదని తెలిపారు. తాను 1992 నుంచి ఈ పంటను సాగు చేస్తున్నానని తెలిపారు. రైతులు ఆనందంగా ఉంటేనే, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతులకు పథకాలు సక్ర మంగా అందితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ఎంత ఆర్థిక ఇబ్బం దులు ఉన్నా కఠినమైన దీక్షతో ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు నెరవేరుస్తుం దని పేర్కొ న్నారు. అందుకోసమే రెండు లక్షల రుణ మాఫీ అమలు చేసి తీరుతున్నామని స్పష్టం చేశారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

● రైతును రాజు చేయడమే లక్ష్యం

- ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



తమ ప్రభుత్వం రైతును రాజు చేయడమే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతుందని, గత 10 సంవత్సరాల కాలంలో ఏనాడూ రైతుల గురించి మాట్లాడని మాజీ మంత్రి కేటీఆర్, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ సత్యదూరమైన మాటలు మాట్లాడవద్దని, సంక్షేమ పథకాలను అడ్డుకోవాలనే వైఖరి మార్చుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రుణమాఫీ బృహత్తర కార్యక్రమమని, రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. ఆరు నూరైనా అన్ని గ్యారంటీ పథకాలను అమలు చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సూచనల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునేందుకే రైతు భరోసాపై సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారి అభిప్రాయాలను తీసుకొని విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. 31 వేల కోట్ల రూపాయల రైతుల పంట రుణాలను మాఫీ చేస్తున్నామని వెల్లడించారు.

● రైతు రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది

- రాష్ట్ర సాగు నీటిపారుదల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



రైతు రుణమాఫీ పథకం చరిత్రలో నిలిచిపోతుందని సాగునీటి, పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18న ఒక్కరోజే 11 లక్షల మంది రైతుల ఖాతాల్లో 7,000 కోట్లు జమ చేసిందని పేర్కొన్నారు. భారత దేశ చరిత్రలో ఒకేసారి ఇంత స్థాయిలో ఎక్కడ రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తమ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ ప్రక్రియలో భాగంగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. గత పాలకులు 10 సంవత్సరాల కాలంలో 25 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తమ ప్రభుత్వం ఏడు నెలల్లో 31 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నదని తెలిపారు. రైతుల సూచనలు పరిగణన లోకి తీసుకొని రైతు భరోసా అమలు చేస్తామని పేర్కొన్నారు. కరీం నగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారిస్తానని తెలిపారు.

● ప్రతిపక్షాల గోబెల్స్ ప్రచారాన్ని నమ్మవద్దు

- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



రైతు భరోసాపై ప్రతిపక్షాలు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని రెవెన్యూ, హౌసింగ్, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని వారి సూచనల ప్రకారమే రైతు భరోసా అందిస్తామని తెలిపారు. గత పాలకు లు నాలుగు గోడల మధ్య కూర్చొని విధానమైన నిర్ణయాలు తీసుకునే వారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అలా కాకుండా రైతుల అభిప్రా యాలను సూచనలను తీసుకొని రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని పేర్కొన్నారు. నిజమైన రైతులకు పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటి దాఖలు చేసే రైతులకు కూడా రైతు భరోసా అందిస్తామని, దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు.

● రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా రైతు భరోసా

-రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రైతుల ఆకాంక్షల కనుగుణంగా రైతు భరోసా పథకం అమలు చేస్తామని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. వ్యవసాయము, రైతులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. రైతులను రాజులు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు అందరి సూచనలు తీసుకొని రైతు భరోసాను అమలు చేస్తామని స్పష్టంచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో తమ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని పేర్కొన్నారు.

సాగుభూములకే సాయం అందించాలి

- ఐదెకరాల నుంచి పదెకరాల చిన్న, సన్నకారు రైతులకు చేయూతనివ్వాలి
- గతంలో మాదిరిగా సబ్సిడీలు.. ఎంఎస్‌పీతోపాటు బోనస్ ఇవ్వండి
- 'రైతు భరోసా' అమలుపై రైతుల అభిప్రాయం

కరీంనగర్ టౌన్, జూలై 19: ఐదు నుంచి పది ఎకరాల వరకు సాగు చేసే రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైతులు కోరారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో రైతు భరోసా పథకం అమలుపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల నుంచి మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయాలను సేకరించింది. ఈ సందర్భంగా 13 నియోజకవర్గాలకు సంబం ధించిన రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బడా వ్యవసాయదారులకు రైతు భరోసాను అందించవద్దని, సన్న చిన్నకారు రైతులకే అందించే ఆదుకోవాలని కోరారు. వ్యవసాయం చేసే భూములకే అందించాలని, నిరుపయోగంగా ఉన్న భూములకు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. వందలాది ఎకరాలు ఉన్న రైతులకు పథకాన్ని వర్తింపజేయవద్దని, రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందించే ఆదుకోవాలని కోరారు. ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని సూచించారు. రాళ్లకు రప్పలకు గుట్టలకు సాగు యోగ్యం లేని భూములకు పెట్టుబడి సాయం అందించవదద్దన్నారు. భూస్వాములకు గత పాలకులు ఇష్టారాజ్యంగా పెట్టుబడి సాయం అందించారు. సన్న చిన్న కారు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలన్నారు. పది నుంచి 12 ఎకరాల వరకు ఉన్న రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఉద్యోగం చేస్తున్న వారికి, బడా వ్యాపారులకు పెట్టుబడి సాయం అందించవద్దన్నారు. ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. రైతులు లక్ష్మారెడ్డి, కడారి రమణారెడ్డి, రాజిరెడ్డి, శశిభూషణ్‌కాచె, కూరగాయల శ్రీనివాస్, పురషోత్తంరెడ్డి, జోగినేని సంపత్‌రావు, నిశాంత్ రెడ్డి, వేముల ముత్యంరెడ్డి, వెంకటిరెడ్డి, రాజిరెడ్డి, మహంకాళి, నారాయణరెడ్డి, రాంరెడ్డి తదితరులు రైతుభరోసాపై అభిప్రాయం వ్యక్తం చేశారు.

● మాట్లాడే అవకాశం ఇవ్వాలని రైతుల ఆందోళన

రైతుభరోసా అమలుపై రైతుల అభిప్రాయ సేకరణలో తమకు కూడా అవకాశం ఇవ్వాలని పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు వేదిక వద్దకు వచ్చి ఆందోళకు దిగారు. వేదికపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీనితో వేదికపై నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వారిని శాంతింపజేసేందుకు అభిప్రాయాలను రాసి ఇవ్వాలంటూ పదేపదే సూచించినా వారు ససేమిరా వినక పోవడంతో వారి వద్దకు వచ్చి వారిలో కొందరిని మాట్లాడించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, జూలై 19: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవై ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బ్రాహ్మణపెల్లి యుగేందర్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యా లయం ఆవర ణలో ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ ఎం కింద 8 రకాల పోస్టులను భర్తీ చేయడానికి ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భర్తీ ప్రక్రియను నిలిపివేశార న్నారు. అయితే ఇతర జిల్లాలైన మంచి ర్యాల, జగి త్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాల పల్లిలో నియమక ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు కాలయాపన చేయ కుండా పోస్టుల ను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుం టే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రేపు గూగుల్ మీట్ ద్వారా కవి సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్, జూలై 19: మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు ప్రారంభమవు తున్న సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గూగుల్ మీట్ ద్వారా కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వేంకటేశ్వర్‌రావు, అతిథులుగా కాంచనపల్లి గోవర్ధనరాజు, నాగిళ్ల రామశాస్త్రి, గంటా మనోహర్‌రెడ్డి హాజరౌతారని పేర్కొన్నారు. వివరాలకు 9014559059 నెంబర్లో సంప్రదించాలని, కవులు, రచయితలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై19 : నగరంలో విద్యుత్ సబ్‌స్టేష న్‌ల మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు పద్మనగర్, రాం నగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయకనగర్, కూర్మవాడ, శ్రీహరినగర్, పిటిసి, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్క్, పాత లేబర్ అడ్డా ప్రాం తం, సిద్ధార్థ పాఠ శాల, వాసర ఆసుపత్రి, పారమిత పాఠశాల ప్రాంతం, శివనగర్, సప్తగిరి కాలనీ, బతు కమ్మ కాలనీ, టెలిఫోన్ క్వార్టర్ ప్రాంతం, లారెల్ పాఠశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహక రించాలని కోరారు.

మంత్రులకు ఘనస్వాగతం

● చొక్కారావు విగ్రహం పునప్రతిష్ఠ

కరీంనగర్ అర్బన్, జూలై 19 : రైతుభరోసా అమలుపై మంత్రివర్గ ఉప సంఘం రైతుల నుంచి అభిప్రయాల సేకరణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి, ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్‌కమిషనర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఇద్దరు మంత్రులకు ఏఆర్ గార్డ్స్ సలామి ఇచ్చారు. 10 మంది పోలీసులు తుపాకులతో గౌరవవందనం సమర్పించారు. అప్పటికే అతిథి గృహంకు చేరు కున్న ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌లు మంత్రు లను కలిసి స్వాగతం పలికారు. కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు పోటీ పడ్డారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై ఇద్దరు మంత్రులకు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. జర్నలిస్టులు ఇళ్లస్థలాల విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పరిశీ లిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంకు చేరుకున్న ఇద్దరు మంత్రులు మధ్యాహ్నం 1:30 గంటల వరకు అక్కడే అధికారులు, పార్టీ నాయకులతో వేర్వేరుగా మాట్లాడుతూ తీరికలేకుండా గడిపారు. అనంతరం మాజీ మంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా వన్‌టౌన్ ఎదురుగా ఐలాండ్ రినవేషన్‌లో పునప్రతిష్ఠించిన చొక్కారావు విగ్రహాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముసుగుతొలగించి ఆవిష్కరణ చేశారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు

● భారీ బందోబస్తు

రైతు భరోసా అభిప్రాయ సేకరణ జరిగిన బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లోని వి కన్వెన్షన్‌తో పాటు మంత్రులు విశ్రాంతి తీసుకున్న కరీంనగర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సాయుధ పోలీసులను మోహరించారు. ఐదుగురు మంత్రులు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, సుడా చైర్మన్, జిల్లాల కలెక్టర్లు, పోలీస్‌కమిషనర్, ఎస్పీలు, ఇతర నాయకులు ఆర్‌అండ్ బీ అతిథ్యమంలో, వీ కన్వెన్షన్ సమావేశంలో పాల్గొంటున్న సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రెండు చోట్ల కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు


● జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

తిమ్మాపూర్, జూలై19: డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, తిమ్మాపూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్, హుజురాబాద్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు ఆగస్టు 5 వరకు కొనసా గనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక పేపర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో పేపర్ సెకండరీ గ్రేడ్‌కు(ఎస్‌జీటి) సంబంధించి పరీక్షలు జరిగాయి. శుక్రవారం జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఉదయం జరిగిన పరీక్షకు 1077 మందికి 972 మంది పరీక్షకు హాజరు కాగా, మధ్యా హ్నం జరిగిన రెండవ పరీక్షకు 1,123 మందికి 1088 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించలేదు.



తిమ్మాపూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

కమిషనరేట్ పరిధిలో 11 మంది ఎస్‌ఐల బదిలీలు



కరీంనగర్ క్రైం, జూలై 19: పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ శుక్రవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసారు. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ శ్రీధర్‌ను ట్రాఫిక్ పోలీసు ఠాణాకు, కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న జి అనూషను చొప్పదండి ఎస్‌ఐగా, చొప్పదండి ఎస్‌ఐగా పనిచేస్తున్న ఉపేంద్రాచారిని కరీంనగర్ ట్రాఫిక్ విభాగానికి, కమిషనరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న యూనస్ అహ్మద్ అలీని హుజురాబాద్ టౌన్ పోలీసు ఠాణాకు, కమిషనరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న టి వివేక్‌ను జమ్మికుంట పోలీసు ఠాణాకు, కరీంనగర్ ట్రాఫిక్‌లో పనిచేస్తున్న డి చంద్రశేఖర్‌ను కరీంనగర్ రెండో పోలీసు ఠాణాకు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న పి అభిలాష్‌ను కరీంనగర్ మూడో ఠాణాకు, జమ్మికుంట పోలీసు ఠాణాలో పనిచేస్తున్న ఎస్ రాజేష్‌ను (వీఆర్) కరీంనగర్‌కు, కమిషనరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎన్ శ్రీనివాస్‌ను కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌కు, హుజూ రాబాద్ టౌన్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న జి సాంబయ్యను సీసీఎస్ పోలీసు ఠాణాకు, కరీంనగర్ వీఆర్‌లో ఉన్న ఎస్ హనుమంతరావును పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

సైదాపూర్, జూలై 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామానికి చెందిన మొలుగు లచ్చమ్మ(70) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,, ఎలబోతారం గ్రామానికి చెందిన లచ్చమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు లచ్చమ్మను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతు లచ్చమ్మ మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎగువ నుంచి ఎస్సారెస్పీకి పెరిగిన వరద


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాం తాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 26.112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 475 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 10.584 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.979 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మహేశ్

చొప్పదండి, జూలై19: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది, చైర్మెన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మెన్ మునిగాల రాజేందర్, సభ్యులుగా చుప్ప శ్రీనివాస్, పెరుమాండ్ల రవీందర్, ఈర్ల స్వామి, జక్కుల అనిల్ కుమార్, గోస్కుల కొమురెల్లి, పత్తిపాక నరేశ్, వెల్లాల ఆదిరెడ్డి, జాతరకొండ ఓదయ్య, చిలుక సంజీవ్, కొత్తపల్లి నవీన్, యంసాని శంబయ్య, పట్వారి కిషన్‌ను ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జూలై 19: మండలంలోని ధర్మాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాయికల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరుపారిపోయినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.8100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

నరసింహుడి ఆలయంలో భక్తుడిపై దాడి

ధర్మపురి, జూలై 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒక భక్తుడిపై ఆలయ ఉద్యోగి, కొందరు కలిసి శుక్రవారం దాడికి పాల్పడ్డారు. ఆలయ నిత్యాన్నదాన సత్రంలో ఒక భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. బియ్యం దొడ్డుగా ఉన్నట్లు ఉద్యోగులతో పాటు వంట తయారీ చేసిన వ్యక్తిని అడిగినట్లు సమాచారం. అయితే తమకు ఏమి తెలియదని ఈవో ఆఫీస్‌లో ఫిర్యాదు చేయమని భక్తుడికి తెలియసేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగి అన్నదానం ప్రదేశానికి రావడం వల్ల భక్తుడు దొడ్డు బియ్యం గురించి అతనికి వివరించారు. అనంతరం ఉద్యోగి పేరు, హోదా గురించి ప్రశ్నించాడు. వెంటనే ఆ ఉద్యోగి ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లినట్లు సమాచారం. భక్తుడు ఈవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా ఆ ఉద్యోగికి భక్తుడికి తీవ్ర వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. భక్తుడి కుటుంబ సభ్యులతో కలిసి ఆఫీస్ నుండి కింది రాగా ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యుల సమక్షంలో భక్తుడిని ఉద్యోగి సహా మరి కొందరు కొట్టినట్లు తెలిసింది. ఈ విషయమై ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- గ్రామాభివృద్ధి పేరుతో వేలం పాటలు

- పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మల్లాపూర్, జూలై 19: మల్లాపూర్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా ఇష్టారీతిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేయడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల అభివృద్ధి పేరిట వీడీసీలు గ్రామంలో కూల్ డ్రింక్, పెట్రోల్, డీజిల్, చికెన్ విక్రయాలు చేయడానికి, ఇసుక, మట్టిని తరలించడానికి వ్యాపారం చేసుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అక్రమ వ్యాపారస్థులు రెచ్చిపోతున్నారు. గోదావరి పరివాహక గ్రామాల్లో దొరికే ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు అక్రమంగా తరలించడమే దందాగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇసుక రవాణాకు ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా సాగుతోందని స్థానికుల చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక మాఫీయా ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



శాయంపేటలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

జమ్మికుంట, జూలై 19: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తండా ఉండాలని జమ్మికుంట టౌన్ సీఐ రవి అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అలాగే యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని సూచించారు. చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానం దక్కుతుందని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

» ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 19: అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందేలా, పథకాలు అమలయ్యేలా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సుడా చైర్మన్, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రత్యేకంగా కలెక్టర్లు, సీపీ, ఎస్పీల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పనితీరును మంత్రులు ప్రశంసించారు. 60 శాతం పైగా భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నా యని సీపీ అభిషేక్ మొహంతి మంత్రుల దృష్టికి తీసుకురాగా బాధితు లకు న్యాయం అందించేలా పారదర్శక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదే విధంగా ముందుకుసాగాలన్నారు. న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

● ఎమ్మెల్యేలతో కూడా మంత్రులు కొద్దిసేపు మాట్లాడి నియో జకవర్గాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియోజకవర్గాల పరిధిలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రులు దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నిటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ శివారు ప్రాంతాల్లో భూకబ్జాలు అధికమయ్యాయని, పేదలు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు, కరీంనగర్ పోలీస్‌కమిషనర్, జగిత్యాల, సిరిసిల్ల ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

● కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరాలశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు ఉమ్మడి జిల్లాలో ఆయా శాఖల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణకు అన్యాయం

» రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 19: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు కాకపోవడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు అంశాలను ప్రవేశపెట్టాలని చెప్పారు. పునర్విభజన చట్టంలోని హామీల అమలుపై తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు స్పందించాల న్నారు. చట్టంలోని అంశాలు అమలు కాక తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాల అభివృ ద్ధికి ప్రత్యేక నిధులు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన హామీల్లో ఉన్నప్పటికీ అమలు చేయలే ద న్నారు. ఆంధ్రప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చా రని, తెలంగాణ ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం లో ముఖ్యమంత్రిగా కేసీఆర్ అనేక తప్పులు చేశారని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును విస్మరించారని చెప్పారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రాణ హిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి సంబంధించి సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలన్నారు. వేలం వేసే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతుందని, వేలం వేస్తే ప్రైవేటీకరణ చేసినట్లే అవుతుం దని, సింగరేణిని ప్రైవేటీకరణ చేయనని చెప్పిన మోదీ పచ్చి అబద్ధాల కోరనే విషయం అర్థమయిందన్నారు. 27వ తేదీన గ్లోబల్ టెండర్లు పిలుస్తున్నందున తక్షణమే టెండర్‌లు రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ప్రక్రియను ప్రారంభించిం దన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ చేయాలని, బ్యాంకుల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదని తక్షణమే చెల్లించాలన్నారు. ఎకరానికి 7,500 ఇస్తామని హామీ ఇచ్చారని సంవత్సరానికి 15 వేలు ఇవ్వాలని, ధాన్యానికి 500 బోనస్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని చెప్పిందని అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుచేయాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డులు లేక పదేళ్ల పాటుప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ కూలీలకు వారానికి ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాలని సూచిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకపాలన అందించాల న్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై సీపీఐ నాయకత్వం, ప్రజా సంఘాలు కిం ది స్థాయి వరకు పరిశీలించి ప్రజలకు అందే విధంగా చూస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలుపెట్టుకున్నారని వాటన్నిం టిని అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బామండ్లపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నల్లగొండ శ్రీనివాస్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట జూలై 19: కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన జవ్వాజి శేఖర్ అనే గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి పడగా గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కల్లు తీయడానికి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తుకింద పడిపోయాడు. గాయాలైన శేఖర్‌ను తోటి కార్మికులు వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలిం చారు.

41 మంది మందుబాబులకు జరిమానా

తంగళ్లపల్లి, జూలై 19: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారితోపాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 41 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించినట్లు తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 18 మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2 వేలు, తొమ్మిది మందికి రూ. 1,500, 11 మందికి రూ.1000, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 18 మందికి రూ.210 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొల్లపల్లిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట, జూలై 19: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని 25 మంది వాహనదారులకు జరిమానా విధించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వాహన పత్రాలు లేకుండా నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, జూలై 19: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నం చేసిన నేరేళ్ల మహేష్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.. ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేళ్ల భూమయ్య కొడుకైన మహేష్ ఇటీవల తనకు సెల్ ఫోన్, బైక్ కొనివ్వాలని, లేదంటే తను చనిపోతానని తండ్రిని బెదిరించాడు. దీంతో తండ్రి సెల్‌ఫోన్, బైక్ కొనిచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా పండగపూట తండ్రి కొడుకును ఊరికే బైక్ మీద తిరగకు, రోజులు బాగా లేవని మందలించాడు. మనస్తాపానికి గురైన మహేష్ ఇంటి వెనకాల పురుగుల మందు తాగి పడిపోయాడు.. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం హుటాహుటిన కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

సుల్తానాబాద్, జూలై 19: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన సుద్దాల కొమురయ్య అలియాస్ చిక్కుడు కొమురయ్య (63) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురయ్య తన ఇంట్లో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని మల్లయ్య పల్లి గ్రామానికి శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గుంటల భూమి కోసం మరదలిని హత్యచేసిన బావ

- నాలుగు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు

గంగాధర, జూలై 19: ఆరుగుంటల భూమి పంచి ఇవ్వడంలేదని కక్ష పెంచుకుని సొంత భార్య చెల్లిని హత్య చేసిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం మాధవి ఈనెల 15న అనుమానాస్పదంగా మృతి చెందిందని ఆమె మేన మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాధవి కొన్ని రోజులుగా తమ మాటవినకుండా యువకుడితో సన్నిహితంగా ఉంటుందని, తమకు రావాల్సిన గర్షకుర్తిలోని 6 గుంటల భూమి పంచి ఇవ్వడంలేదని బావ గుండ అంజనేయులు, అక్క గుండ మానసలు కక్ష పెంచుకున్నారు. ఈక్రమంలో ఏలాగైనా మాధవి అడ్డుతొలగించుకుని భూమిని కాజేయాలని ఆంజనేయులు ఈనెల 14 గర్షకుర్తికి వచ్చాడు. ఇంటిలో మాధవి ఒంటరిగా ఉండగా భూమి విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన ఆంజనేయులు తన మాట వినడంలేదని చున్నీతో మాధవి మెడకు బిగించి చంపివేశాడు. అనంతరం ఎవ్వరికి అనుమానం రాకుండా ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేరివేసుకున్నట్లు వేలాడదీశాడు. అనుమానం రాకుండా స్వగ్రామం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు వెళ్లి తన భార్య మానసకు విషయం చెప్పాడు. అయితే అనుమానాస్పదకేసు నమోదు చేసిన ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి వివిధ కోణాల్లో విచారించారు. ఆంజనేయులు, మానసలు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్‌ఐ కిరణ్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

గంజాయికి అలవాటుపడి..పెడ్లర్‌గా మారి..

● గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి

● మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా పట్టుబడిన వైనం

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం..కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19: గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదు గురు విద్యార్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సం యుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీలో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీరాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంపత్‌నాయుడు (20), ఓ మైనర్, స్వయంపాకుల కార్తీక్ (20)లతోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మిన హా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

అటవీశాఖలో అధికారుల బదిలీలు

సిరిసిల్ల క్రైం , జూలై 19: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలువురు అటవీశాఖ ఆధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. 3 సంవత్సరాల కంటే ఎక్కువ ఒకే చోట పనిచేసిన సెక్షన్ అధికారులు, బీట్ అధికారులకు బదిలీ తప్పలేదు. సిరిసిల్ల సెక్ష న్ అధికారి భూలక్ష్మి సిరిసిల్ల స్ట్రైకింగ్ ఫోర్స్ సెక్షన్ అధికారిగా, గంగాధర డిప్యూటీ రేంజ్ అధికారిగా బాపిరాజు, వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారిగా మోహన్ లాల్ , శ్రవణ్‌కుమార్‌కు సిరిసిల్ల సెక్షన్ అధికారిగా, బీట్ అధికారులుగా వి సతీష్ (అల్మాస్‌పూర్), లావణ్య (గర్జనపల్లి), వసుమతి (పెద్ద లింగాపూర్)కు బదిలీ అయ్యారు. వీరందరూ జీవో నెంబర్ 18 ప్రకారం ఈ నెల 21న రిలీవ్ కావాల్సి ఉంది.

పోస్టర్ల ఆవిష్కరణ


సుభాష్‌నగర్, జూలై 19: నాస్తిక సమాజం మూడో మహాసభల పోస్టర్లను శుక్రవారం భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు ఉప్పలేటి నరేష్ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుకొండలోని వడ్డేపల్లి పీఆర్‌రెడ్డి భవన్‌లో ఈనెల 24న మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో కుల, మత, మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న నాస్తిక సమాజం 52 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హనుమకొండలో నిర్వహిస్తున్నామని నాస్తికులు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

హుజూరాబాద్, జూలై 19: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కాయకల్ప అవార్డు బృందం సభ్యులు డాక్టర్ హరిప్రియ, క్వాలిటీ మేనేజర్ సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, ఏవో నారాయణరెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా ఆస్పత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్



మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్

సిరిసిల్ల రూరల్, జూలై 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో శుక్రవారం జేఏసీ నాయకుల సమావేశం సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలల్లో నెలకొన్న విద్యుత్ ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలంటూ ఈ నెల 22 నుంచి సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలేనిరహారదీక్షలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీక్షలను కొనసాగిస్తూనే 22న సోమవారం వంటావార్పు కార్యక్రమంతో ప్రారంభించి 23న రాస్తారోకో, 24న పట్టణ బంద్‌కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి అసెంబ్లీని ముట్టడించేందుకు రూపకల్పన చేశామని వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, అసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం కార్యదర్శి పంతం రవి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వివిధ రూపాల్లో తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేక పోవడంతో జేఏసీ అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలను కార్మికులు, అసాముల విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అసాముల సంఘం నాయకులు గోనేపర్శరాములు, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి అంకాలపు రవి, పోలు శంకర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, కోడం అశోక్, పిస్క మధు, ఏనుగుల ఎల్లయ్య, గోవిందు రవి, దూడం శంకర్, గాజుల నారాయణ, దూసభూమయ్య, మండల సత్యం, వెల్దండి దేవదాస్, మోర రాజు, కళ్యాడపు సుభాష్, బోద్దుల సుదర్శన్, బండారి అశోక్, బూట్ల నవీన్, బూర కనుకరాజు, దూడం రమేష్, గంగుల శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, హనుమండ్ల రామనారాయణ, బోడ్డు శ్రీధర్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 19: నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి జిల్లాలో నివసిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. సెప్టెంబరు 16లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిపో మేనేజర్లు బాధ్యతల స్వీకరణ



ఈడీ వినోద్‌కుమార్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిపో మేనేజర్లు

భగత్‌నగర్, జూలై 19: నూతనంగా నియమితులైన మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపో మేనేజర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతిపై మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపోలకు మేనేజర్లుగా నియమితులైన వీఎస్ కుమార్, బి శ్రీనివాస్, ఎ ప్రకాశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం, హెడ్ ఆఫీస్, మెహదీపట్నంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్)గా పనిచేస్తున్న వారు డిపో మేనేజర్లుగా పదోన్నతి పొందారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

కొండచిలువ కలకలం



పొలంలో కనిపించిన కొండచిలువ

గంభీరావుపేట, జూలై 19: గంభీరావుపేట సమీపాన ఓ రైతు పొలంలో కొండచిలువ కనిపించడం కలకలం రేగింది. మల్యాల రాజువీర్‌కు చెందిన పొలంలో శుక్రవారం కొండచిలువను రైతు గమనించారు. వ్యవసాయ పనుల్లో ఉన్న ఆ రైతు కొండ చిలువ చూసి భయంతో వణికిపోయాడు. అతడు కేకలు వేయడంతో సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకునే సరికి కొండచిలువ వెళ్లిపోయింది. దీంతో సమీప ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, జూలై 19: రుద్రంగి మండల కేంద్రం శివారులోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సును ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పండుల శ్రీనివాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య మాధవికి తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్, మాధవిని వేములవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌యూ ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 19: శాతవాహన విద్యాలయంలో మే 2024లో నిర్వహించిన ఎం ఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌యూ.ఏసీ.ఇన్‌.జీ. అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైకును ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బీర్‌పూర్, జూలై 19: ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను అజాగ్రత్తతో ట్రాక్టర్ నడిపి వాహనాన్ని ఢీ కిట్టిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమో దు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం దొంతాపూర్ గ్రామానికి చెందిన సర్దా లక్ష్మన్ అతడి భార్య జమున తమ ద్విచక్ర వాహనంపై దొంతాపూర్ నుంచి జగిత్యాలకు వెలుతున్నారు. నర్సింహులపల్లి గ్రామ శివారులో సూరపాక తిరుపతి బీర్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ నడుపుతూ వారి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో పై ఇద్దరికి గాయాలయ్యాయి. వరుసకు కొడుకైన సర్దా సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాకాంబరీ అవతారంలో వాసవీమాత



కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని వాసవీ దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ మత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ కూరగాయలతో అమ్మవారికి అలకరించి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కంకుమపూజ కార్యక్రమాన్ని నిర్వహించచారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం జరిపి గోరింటాకు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు రాజేంధప్రసాద్, సంతోష్, శ్రీకాంత్ పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్

సుభాష్‌నగర్, జూలై 19: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఈ నెల 30,31 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12లక్షలు ప్రతి మాదిగ కుటుంబానికి ప్రభుత్వం ఇవ్వాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కెటాయించాలని, వికలాంగులకు రూ. 7వేల ఫించన్ ఇవ్వాలని, సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, డప్పు కొట్టే మాదిగలకు రూ. 5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, కార్యదర్శి మాచారం మాసయ్య, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ కనకం రవి, జిల్లా అధ్యక్షుడు రమాగిరి సారయ్య, బొడ్డు లక్ష్మన్, సంటి గణేశ్, ఖమ్మం కృష్ణ, మాట్ల రాజ్‌కుమార్, మాతంగి కుమారస్వామి, నందేల దేవయ్య, సుంకపాక దేవరాజు, దాల్లపల్లి లక్ష్మన్, అరికిల్ల గణపతి, ఖమ్మం కుమారస్వామి, ఎన్నగందుల శ్రీకాంత్, కనకం రాజు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్

టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

జువ్వాడి చొక్కారావుకు ఘన నివాళి



చొక్కారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సుభాష్‌నగర్, జూలై 19: మాజీ ఎంపీ జువ్వాడి చొక్కారావు జయంతి సందర్భంగా నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చొక్కారావు విగ్రహానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన రాజకీయ గురువు జువ్వాడి చొక్కారావు అన్నారు. చొక్కారావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా జిల్లాకు ఎనలేని సేవందించారని కొనియాడారు. అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొక్కారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నేటి నుంచి కట్టరాంపూర్ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 19: నగరంలోని కట్టరాంపూర్ మహాలక్ష్మి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జోగినపల్లి పద్మ-అశోక్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం అంకురార్పణ, 22న ఉదయం 11 గంటలకు కల్యాణం, నాణెములతో తులాభారం, సాయంత్రం గరుడసేవ ఉంటాయని పేర్కొన్నారు. 23న ఉదయం సుదర్శన హోమం, హనుమత్‌వాహనసేవ, సాయంత్రం పుష్కరిణిలో తెప్పోత్సవం, 24న సుదర్శనహోమం, సాయంత్రం ఆలయం నుంచి స్టేడియం వరకు రథోత్సవం, 25న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంతసేవ ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

'అల్ఫోర్స్'లో ఘనంగా బోనాల జాతర



బోనం ఎత్తుకున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూలై 19: ఆషాఢమాసం సందర్భంగా స్థానిక వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీటాట్స్ స్కూల్లో శుక్రవారం అమ్మవారి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ హాజరై మహంకాళి, దుర్గామాతలకు బోనాలు సమర్పించి, పూజలు జరిపి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చిన్నారుల నృత్యాలు, వేషధారణలు, పోతరాజుల విన్యాసాలు, అలంకరణలు, బోనాల సమర్పణలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో బోనాల ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి బోనాల ప్రత్యేకత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి ఆచారసంప్రదాయాల గురించి తెలుసు కోవాలన్నారు. అనంతరం హౌజ్ ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్, జూలై 19: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీలు తిరుగుతూ ఇళ్లలో నిల్వ ఉన్న నీరును తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్ జరీనా, రమ, రజిత, కిషన్‌రావు, కుమారస్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జూలై 19: హుజూరాబాద్ నియోజకవర్గంలోని అనారోగ్య బాధిత కుటుంబాలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) అందజేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స నిమిత్తం రూ. 5.50లక్షల విలువ గల ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఇల్లందకుంట, జూలై 19: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మెడికల్ క్యాంపుతో పాటు సీజనల్ వ్యాధులపై మెడికలాఫీసర్ డాక్టర్ తులసీదాస్ శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. పరిసర పరిశుభ్రతతో పాటు హ్యాండ్ వాష్ చేసుకోవాలని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడ కూడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కూలర్లు, డబ్బాలు, కొబ్బ రి బొండాల్లో నీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచ కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఏఎ న్ఎం సునీత, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల మాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాల మాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రైతు భరోసా, రుణమాఫీ మోసలను నిరూపిస్తామని రాజీనామాకు సిద్ధమా అంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 శాతం మంది రైతులకు రూ. లక్ష మాఫీ వర్తించలేదని నిరూపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నించారు. మేం నిరూపించకపోతే రాజకీయాల నుంచి వైదొలిగేందు కు మేం సిద్ధమని ప్రకటించారు. దమ్ముంటే పంట రుణాలు రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పినట్టుగా రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతుల్లో నూటికి 70 శాతం మందికి రుణమాఫీ వల్ల లాభం కలగలేదని నిరూపిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీ డిప్యూటి మేయర్ గుగ్గిళ్ల రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** ఎన్నికల ముందు రైతులందరికీ రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీలు పెట్టి నట్టేట ముంచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వానా కాలం ప్రారంభమైనా రైతు భరోసా నిధులను పక్కదారి పట్టించి రుణమాఫీ డ్రామా ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ పేరిట, ప్రచారాలు, సంబరాలు చేసుకోవడానికి సిగ్గు ఉండాలన్నారు. ఈ రుణమాఫీలో ఏ రైతుకు మాఫీ అయ్యిందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధి విషయంలో లేదన్నారు. సమావేశంలో వెంకట్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, సంపత్‌రావు, బింగి కరుణాకర్, గంగిశెట్టి రాజు, రాముల కుమార్, అంకిత శ్రీనివాస్, యాళ్ల సంజీవరెడ్డి, వొద్నాల చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

రేపు గురు పౌర్ణమి

కరీంనగర్ కల్చరల్, జూలై 19: వేద వ్యాస మహర్షి జయంతిని గురు పౌర్ణమిగా జరుపుకుంటారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి సత్యవతీ పరాశరులకు జన్మించిన వ్యాసున్ని శ్రీమన్నారాయణ స్వరూపుడుగా పలు గ్రంథాలు పేర్కొన్నాయి. వ్యాస పౌర్ణమి, గురుపౌర్ణమిని ఆదివారం జరుపుకోనున్నారు. వ్యాసుడు ఒక రాశిగా ఉన్న వేదాన్ని నాలుగుగా విభజించి వేద వ్యాసుడుగా, గురువులకే గురువుగా కీర్తించబడ్డాడు. ఋగ్వేదాన్ని పైలునికి, యజుర్వేదాన్ని వైశంపాయనునికి, సామ వేదాన్ని జైమినికి, అధర్వవేదాన్ని సుమంతునికి బోధించాడు. పంచమ వేదమైన మహాభారత గ్రంథాన్ని రచించాడు. 18 పురాణాలను మానవాళికి అందించాడు. ఆ పురాణాలను ప్రతిరోజు స్మరిస్తేనే అశ్వమేధయాగ ఫలం దక్కుతుందని మార్కండేయ పురాణం చెబుతుంది. గొప్ప జ్ఞాన సంపదను అందించిన వ్యాస మహర్షిని తొలి గురువుగా, జగద్గురువుగా పూజించడం సాంప్రదాయంగా వస్తోంది. గురు పరంపరను పాటించే వారు వారి గురువు దగ్గరికి వెళ్లి గురుపూజ, సన్మానాలు జరిపి ఆశీస్సులు పొందుతారు. ఆలయాల్లో వ్యాసపూజలు, అభిషేకాలు జరుపుతారు. నదీ స్నానాలు ఆచరించి గురుస్మరణ, గురువు ఉపదేశించిన స్తోత్రాలు, మంత్రాలు, పారాయణాలు, దానధర్మాలు, పుణ్యకార్యాలు చేస్తే సిద్ధి పొందుతారని శాస్త్ర ప్రమాణం. గురుస్తోత్రం, వేద వ్యాస అష్టాదశనామావళి, అష్టాదశపురాణ నామస్తోత్రం, పఠించడం ద్వారా విశేష ఫలితం పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి.

రక్త దానంతో మహిళను ఆదుకున్న అధ్యాపకుడు

గణేశ్‌నగర్,జూలై 19: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు రక్త దానంతో మహిళను ఆదుకున్నట్లు కామర్స్ విభాగాధిపతి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ తెలిపారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఒరిసేకొండ గ్రామానికి చెందిన మహిళ గుండెకు ఆపరేషన్ నిమిత్తం అపోలో రీచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆపదలో బి పాజిటివ్ రక్తం అవసరమవగా కళాశాల కామర్స్ అధ్యాపకుడు బి మహేష్ రక్తదానం చేసి ఆదుకున్నాడు. ఈ సందర్భంగా అధ్యాపకుడు బి మహేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ బి సంపత్ కుమార్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్ గోపికృష్ణ, ఏవో బి శ్రావణ్ కుమార్, అధ్యాపక బృందం అభినందించారు.

చైర్మన్‌ను కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 19: తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగిరి జగదీశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి - చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్, అక్షరాభ్యాసం చేయిస్తున్న అనూప్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 19: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ సూచించారు. శుక్రవారం 37వ డివిజన్ నగరపాలక సంస్థ పరిధిలో గల రాంనగర్‌లోని అంగన్‌వాడీ న్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన శుక్రవారం సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ హాజరై స్వరూపరాణి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, వారి తల్లులకు సీజనల్ వ్యాధుల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఏఎన్ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీలో చిన్నారులను నమోదు చేయాలని చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని తెలిపారు. తల్లులు పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య శాఖ అధికారులు అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏం స్వరూప శ్రీలత అంగన్వాడి టీచర్ భాగ్యలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

భగత్‌నగర్: అమ్మమాట, అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్ కార్పొరేటర్ దుర్శేడ్ అనూప్‌కుమార్ ఆధ్వర్యంలో 11మంది పిల్లలకు శుక్రవారం మహాశక్తి దేవాలయంలో అక్షరాభ్యాసం నిర్వహిం చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కోసం పలక లు, విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమం లో 57వ డివిజన్ కార్పొరేటర్ సుమరమణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బల్మూరి విజయ, అంగన్‌వాడీ టీచర్ వనజ, పద్మావతి, పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల మాలలో దర్శనమిచ్చిన దుర్గాదేవి



నిమ్మకాయల మాలతో అమ్మవారు

కరీంనగర్ రూరల్, జూలై 19: మండలంలోని నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గభవానీ ఆలయంలో ఆశాడ శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం నిమ్మకాయల మాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది బ్రాహ్మణ ముత్తైదువులకు సువాసినీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శక్తి సంవిధానాన్ని వివిధ రూపాల్లో ఆరాధించడం సంప్రదాయంగా వస్తున్న మన ఆచారం అన్నారు. పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు, ముత్తైదువులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



హుజూరాబాద్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్, జూలై 19: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చారు. కార్యక్రమంలో నరేష్, శ్రావణ్, సతీష్, నవీన్, గంగరాజు, అనిల్, రాఘవేంద్ర, చంద్రశేఖర్, మహేందర్, విష్ణువర్ధన్, ప్రసాద్, రమేశ్, సాయితేజ, నాగరాజు, రవితేజ, బాలు, రాజేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని బ్రాహ్మణపల్లి, రెడ్డిపల్లి, శ్రీరాములపేట గ్రామాల్లో రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బ్రాహ్మణపల్లిలో రైతులు వరి పొలాల సమీపంలో ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమములో మందా అనిల్ రెడ్డి, భగవాన్‌రెడ్డి, కురిమిండ్ల తిరుపతి, యాదగిరి, వెంకన్న, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: రాష్ట్రప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేయడం పట్ల మండలంలోని గంగిపల్లి గ్రామంలో శుక్రవారం రైతు పండుగ సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని ఓ రైతు పొలంలో వరినాట్లు వేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, మాజీ సర్పంచు మాశం శాలిని సాగర్, మాజీ ఎంపీటీసీ చలిగంటి సంపత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర, జూలై 19: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారం తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాము సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గంగాధర, ఆచంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం,పోషణ లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంగాధరలో హాజరైన ఎంపీడీవో రాము మాట్లాడుతూ పిల్లలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికారం తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వా డీల్లో అందిస్తున్న పోషకాహారంతో రక్తహీనత దూరమవుతుందని అన్నారు. ఈసందర్భంగా చిన్నారు ల బరువు పరిశీలించి సూచనలు చేశారు.. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుక, రమాదేవి, పల్లె డాక్టర్లు శిరీష, సురేష్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గన్నేరువరం, జూలై 19: మండల కేంద్రంలో ఎస్ఐ తాండ్ర నరేష్ శుక్రవారం హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చందు, ఉపాధ్యక్షులు దత్తాద్రి, ప్రసాద్, సతీష్, లక్ష్మణ్, వెంకటేశ్, మహేందర్, రాజు, అనిల్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గంగాధర, జూలై 19: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని గంగాధర జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, మేము సైతం ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వప్న అన్నారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాలల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించడం వల్ల సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదిన విద్యార్థులు క్రీడారంగంలో, ప్రాథమిక నైపుణ్యాలు, నైతిక విలువలపై దృష్టి కేంద్రీకరిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం రమేశ్, దాతలు ప్రవళిక, లక్ష్మీ, పద్మ, మురళిమనోహర చారీ, ఉపాధ్యాయులు రమాదేవి, విజయలక్ష్మీ, జలజ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేదారి

గన్నేరువరం, జూలై 19: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేకుంటే పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొనుగంటి కేదారి అన్నారు. గన్నేరువరంలో శుక్రవారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తోందని, ఆరు గ్యారంటీలను ఏలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగభృతి, రుణమాఫీ, బోనస్‌లను ప్రకటించాలని కోరారు. హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుంటనే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆయన తెలిపారు. ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, ఏఐఎస్‌ఫ్ జిల్లా అధ్యక్షులు బోనగిరి మహేందర్, నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, సాగర్‌రెడ్డి, మల్లయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు డ్యాం పనులకు మోక్షమెప్పుడో..?

- ఆరేళ్లుగా పట్టించుకోని అధికారులు

మానకొండూర్, జూలై 19 : మండలంలోని పోచంపల్లి, లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాలలోని రోడ్డు డ్యాం పనులు పూర్తికావడం లేదు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూర్-జమ్మికుంట తారు రోడ్డు నిర్మాణానికి ఆరేళ్ల క్రితం రూ. 70కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులను కరీంనగర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకుని ప్రారంభించారు. ఆరేళ్లుగా పనులు కొనసాగుతున్నాయి. వర్షాలు పడితే నీరు రోడ్డు డ్యాంపై నుంచి ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ తీసుకొని రోడ్డు డ్యాం నిర్మాణ పనులు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అన్నారంలో నిలిచిన పోయిన రోడ్డు డ్యాం పనులు

పదెకరాల వరకు రైతు భరోసా అమలు చేయాలి

భగత్‌నగర్, జూలై 19: పదెకరాల వరకు రైతు భరోసా అమలు చేయాలని కొత్తపల్లి మండలం మల్కాపూర్ రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో రాష్ట్రమంత్రులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదెకరాల వరకు రైతు భరోసాను రైతులకు అందించాలని రైతులు సాగుచేసిన భూమికి మాత్రమే వర్తింప చేయాలన్నారు. రైతు భరోసాపై నిబంధనలు విధించకుండా వ్యవసాయం చేసే ప్రతీ వ్యక్తికి రైతు భరోసా అందించాలని కోరారు.

కరీంనగర్-2 డిపోలో సాంస్కృతిక కార్యక్రమాలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఆర్ఎం సుచరిత

భగత్‌నగర్, జూలై 19: ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో లక్ష్మీ లక్ష్యం కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం కరీంనగర్-2 డిపోలో కల్చరల్ అక్టివిటీలో భాగంగా ఆటలు, మ్యూజికల్ చైర్, రంగోలి, బాస్కెట్‌బాల్, అంత్యాక్షరి, మైండ్‌గేమ్, బాలుకొట్టు బుట్టలో పట్టు వంటి కార్యక్రమాలను మహిళా ఉద్యోగినులకు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎం ఎస్ సుచరిత, ముఖ్య ఆర్గనైజర్ ఎం కమల, డిప్యూటి ఆర్ఎం ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ వి మల్లయ్య, వీఅండ్ ఎస్‌వో బాబురావు, సెక్యూరిటి సిబ్బంది, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సుంకిరెడ్డి' సాహిత్య సదస్సు

కరీంనగర్ కల్చరల్, జూలై 19: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహిత్య విమర్శకుడు, చరిత్రకారుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి రెండు పుస్తకాలపై పరిచయం-పరామర్శ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అస్తిత్వ నిర్మాణ వ్యాసాలు 'వినిర్మాణం' పుస్తకంపై జిలుకర శ్రీనివాస్ సమీక్ష చేయనుండగా 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' పరిశోధనా గ్రంధంపై పుప్పాల శ్రీరాం కావ్య పరామర్శ చేయనున్నారని పేర్కొన్నారు. సదస్సును బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ప్రారంభిస్తారని, వక్తలుగా బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం హాజరౌతారని తెలిపారు. కవులు, రచయితలు, సాహితీప్రి యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి యజ్ఞవరాహ క్షేత్రంలో వార్షిక పవిత్రోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 19: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో శని, ఆది, సోమ వారాల్లో వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం అంకురార్పణ, కుంభారాధన, అధివాసములు, ఆదివారం ఉదయం హోమం, స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, గురుపూజా మహోత్సవం, సాయంత్రం మహాశాంతిహోమం, దీపోత్సవం, తిరువీధి ఉత్సవం, సోమవారం ఉదయం సర్వదైవత్య హోమం, పూర్ణాహుతి, కళావాహనం ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

గన్నేరువరం, జూలై 19: గన్నేరువరంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మారక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహంచారు. ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీకాంత్, భారతి, తహసీల్దార్ భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

450 మంది రైతులకు రుణమాఫీ

చొప్పదండి, జూలై 19: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘంలో 450 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు చైర్మెన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. లక్ష లోపు రుణాలకు సంబంధించి 2,30,64,222 రూపాయల మాఫీ సొమ్ము రైతుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. రైతులకు సోమవారం నుంచి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, జూలై19: రైతు భరోసా పథకంపై విస్తృత స్థాయి సమావేశానికి కరీంనగర్‌కు విచ్చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డిలను కరీంనగర్ కార్పొరే షన్ పరిధిలోని అలుగునూర్ కూడలి వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి స్వా గతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేశారు.

దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ

జమ్మికుంట, జూలై 19: పట్టణంలో హజ్రత్ సయ్యద్ కుద్దుస్ బాబా జన్మదినం సందర్భంగా శుక్రవారం సత్యసాయి దివ్యాంగుల ఆశ్రమంలో మడిపల్లి గ్రామ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మహమూద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, రియాజ్, రాకేష్, మహేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

శంకరపట్నం, జూలై 19: శంకరపట్నం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నిరసిస్తూ శుక్రవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులనుప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.